సైకాలజీ

సాయంకాలము అయిదూ ఆరు గంటల మధ్య వీధి వాకిలి దాటి చంద్రరేఖ బయలు దేరింది. నల్లంచు తెల్లటి ఖద్దరు చీరె - సన్నచుక్కల గుత్తపు రెవిక ఆమె నిసర్గసౌందర్యానికి మెరుగులు పెట్టినట్లున్నాయి. ఆమె తలవంచుకొని - నావ బయలుదేరినట్లుగా మందముగా వీధిలో అడుగులు వేస్తున్నది. ఆమె వీధి మలుపు తిరుగుతుండగా నలుగురు యువకులు ఎదురయినారు.

"ఈ వీధిలో శ్రీమతి చంద్రరేఖగారి యిల్లు ఏదండీ?" ఆ నలుగురిలో ఒక యువకుడు ప్రశ్నించాడు.

ఆమె వాళ్ళ ముఖాలను ఒక నిమిషమునేపు పరిశీలనగా చూసి "వాళ్ళ ఇంటి పేరు?" అన్నది చేతిలో ఉన్న సంచిని త్రిప్పుతూ.

"పట్నములో ఉన్న సోమసుందరముగారి భార్య. వారి ఇల్లు ఈ వీధిలోనే ఉన్నదని చెప్పారు" ఆ యువకుడే ఒక అడుగు ముందుకు వేసి అన్నాడు.

"ఏ సోమసుందరముగారు ?" ప్రశ్నించేటప్పుడు ఆమె నాలుక కాస్త తడబడ్డది.

"కాలేజి లెక్చరరు పి. సోమసుందరం గారండీ"

"సైకాలజీ లెక్చరరుగారేనా ? అయితే మీకు ఆమెతో ఏంపని?" ప్రశ్నించుతుండగా ఆమె నల్లటి కనుబొమలు ఆత్మీయంగా కలుసుకున్నాయి. ముఖము ముకుళించుకు పోయింది.

"వారితో చాలా అవసరమయిన పని ఉండి వచ్చాము."

"అయితే మీరు ఆ కనబడుతున్న గేటులోనుంచి లోపలికి వెళ్ళి - వరెండాలో ఉన్న కుర్చీలమీద కూర్చోండి. నేను అయిదు నిమిషాలలో తిరిగి వస్తాను" - వాళ్ళు ఆ గేటులోనుంచి లోపలికి వెళ్ళేవరకూ చూసి - చంద్రరేఖ చేతినంచీ తిప్పుకుంటూ వెళ్ళిపోయింది.

వాళ్ళతో చెప్పినట్టుగా ఆమె ఐదు నిమిషాలకే రాలేకపోయింది. మరో ఐదు నిమిషాల తరువాత ఇంటికి వస్తూ ఆలోచనలో పడ్డది. వీళ్లు కాలేజి విద్యార్థుల మాదిరిగా ఉన్నారు. లెక్చరరుగారి భార్యను చూడాలన్న కుతూహలము కొద్దీ బయలుదేరి రాలేదుకదా ! జాగ్రత్తగా మాట్లాడటము ఎందుకయినా మంచిదనుకుని - గేటులోనుంచి వస్తూనే "క్షమించండి. సరిగా వస్తానన్న వేళకు రాలేక పోయాను" అంటూ వాళ్లకు సమీపంగా ఉన్న కుర్చీలో కూర్చున్నది.

"ఫరవాలేదు లెండి. ఎంత ఆలస్యమయినా కాచుకొని ఉండి - మీతో సావకాశంగా మాట్లాడాలనే మేము వచ్చాము" మిగతా ముగ్గురూ తన ముఖంకేసి చూస్తుండగా నాలుగవ యువకుడు చంద్రరేఖతో అన్నాడు.

"సరే! మీరు వచ్చిన పనేమిటో తేల్చండి. చాలా శ్రమపడి ఇంతదూరము వచ్చారు".

"అబ్బే! మాకు శ్రమ ఏమిటి? మేము కాలేజీ విద్యార్థుల మండీ - మేము నలుగురమూ నైకాలజీ విద్యార్థులము".

"మిమ్మల్ని చూడగానే విద్యార్థులే అయిఉంటారను కున్నాను. ఆఁ...అయితే"? అన్నది బోడి నవ్వు నవ్వుతూ.

"నీవు చెప్పవోయి మాణిక్యరావు! కవికుమారుడవు కనుక బాగా చెప్తావు" అన్నాడు ముందుగా మాట్లాడిన యువకుడు పక్కనున్న విద్యార్థితో నెమ్మదిగా.

"ఉన్న సంగతి ఉన్నట్టుగా చెప్పటానికి కవిత్వమెందు కోయి? అయినా ఈమె ముందర మనము వాదులాడు కోవటము బొత్తిగా బాగుండలేదు. నీవు చెప్పరా భీమశంకరం!" ఆ విద్యార్థి పక్కనున్న విద్యార్థితో అన్నాడు ఎవరికీ వినబడకుండా.

"చూడండీ! మమ్మల్ని గురించిగాని మారాకను గురించి గానీ మీరు అన్యథా భావించకూడదని నా మనవి. మాకు ఇప్పుడు పరీక్షలు దగ్గరికి వచ్చాయని మీకు కూడా తెలుసు ననుకుంటాను" అంటూ భీమశంకరము మెల్లగా ప్రారంభించాడు.

చంద్రరేఖ తలవంచుకుని వింటున్నది. ఆమె గుండె దడదడ కొట్టుకోవటము మొదలు పెట్టింది.

"ఇది మాకు రెండవ సంవత్సరము; అందుకొరకే భయ పడుతున్నాము. మూడవ తరగతిలో ఉత్తీర్ణులయిన వాళ్లకు ఎక్కడా ఉద్యోగాలు దొరకటంలేదన్న సంగతి అందరికీ తెలి

సిందేకదా! ఇప్పటికి రెండు సంవత్సరాలనుండీ పైకాలజీ విద్యార్థులు రెండవ తరగతి అన్నమాట ఎరగరు."

"ఈ విషయాన్ని విద్యార్థులు గ్రహించటము గొప్ప సంగతే" కనుబొమలు పైకెత్తి అన్నది.

"ఈ ఆర్థిక మాంద్యపు రోజులలో మేము ఆస్తులన్నీ అమ్ముకొని - కన్నవారిని ఇబ్బందిపెట్టి - కాలేజి విద్య సాగిస్తున్నాము. ఇంత కష్టమూపడ్డ తరువాత ఉద్యోగము దొరక్కపోతే ఈ డిగ్రీ వ్యర్థమే కదండీ?"

"నిజమే ఈ దృష్టితో మీరంతా బాగా చదువుతున్నారనుకుంటాను" ఈ కాస్త మాటా అనకపోతే బాగుండదనుకుని అన్నది.

"అవును అందుకొరకే మేము చాలా పట్టుదలతో చదువుతున్నాము. కనీసము రెండవ తరగతిలో నయినా రావాలని మా ప్రయత్నము".

"చాలా సంతోషము. మరి...నాతో...ప్రత్యేకంగా ఈ మాట చెప్పటానికే వచ్చా మంటారా?" చివరి మాటను కాస్త గట్టిగా నొక్కి అన్నది.

"అదే మనవి చేస్తున్నాను. కనీసము రెండవ తరగతిలో నైనా ఉత్తీర్ణుల మవటానికి ఒక్క మా ప్రయత్నము చాలదు. ఎంత బాగా వ్రాసినా పరీక్షకులు కూడా ఈ విషయాన్ని కాస్త మనసులో ఉంచుకోకపోతే లాభము లేదు."

"అది కూడా నిజమే. కాని వ్రాసిన దానిని బట్టేకదూ విలువ కట్టటము? ఇంతకూ అసలు సంగతి చెప్పండి—"మరొక సారి హెచ్చరించింది చంద్రరేఖ.

"అదే మనవిచేయబోతున్నాను. మా లెక్చరరుగారు కూడా శ్రద్ధగా చదువుకొమ్మని పదేపదే హెచ్చరిస్తున్నారు. నిరుడు ఎంతో కష్టపడిన విద్యార్థి ఒకడు మూడవ తరగతిలో ప్యాస య్యాడు. అతడు మొదటి తరగతిలో వస్తాడని లెక్చెరరు కూడా అనుకున్నాడట. ఒక్క నిరుడేకాదు - ఇక్కడికి రెండేళ్ళనుంచీ విద్యార్థులు నానా అగచాట్లు పడుతున్నారు."

"అలాగా!" అన్నది ఆశ్చర్యముతో.

"మా కిది ఆఖరు సంవత్సరము కూడానా - వాళ్ళూవీళ్ళూ చెప్పినవన్నీ వింటుంటే భయంగా ఉన్నది. ఒక విధంగాచూస్తే పరీక్షకులు కఠినంగా ఉండటము మంచిదే — కాని — విద్యార్థులకు గతులు లేకుండాపోతే ఎట్లా చెప్పండి. వాళ్ళ భవిష్యమంతా పాడై పోయినట్లేగా!"

"నిజమే మరి! నేను మాత్రము కాదన్నానా?" అన్నది నిర్వికారముగా.

"మా పేపర్లు సోమసుందరముగారి దగ్గరికి పంపబడతా యని మొన్నమొన్ననే తెలిసింది."

"అట్లాగా!"చంద్రరేఖ హృదయము ఒక్కసారి గతుక్కు మన్నది.

"సోమసుందరంగారు చాలా సహృదయులనీ — ఇది వరకూ విద్యార్థులను చాలా ఆదరంగా చూసేవారనీ చెప్పుకుంటూ ఉంటారు. ఇదివరలో ప్రథమ ద్వితీయ తరగతులలో విజయము పొందిన విద్యార్థులు కూడా ఉన్నారట. మీ బ్యాచ్‌లో కూడా ఇద్దరు ప్రథమ తరగతిలో వచ్చారట కదూ! ఆ తరువాత నుంచే కొద్దిగా

వారి ప్రకృతి మారినట్లున్నది. విద్యార్థులేదైనా అడిగితే చివాట్లు పెడుతూ ఉంటారనీ — అనవసరంగా చికాకుపడుతూ ఉంటారనీ చాలా మంది అంటున్నారు".

చంద్రరేఖ మౌనముతో పైటకొంగు కొనలు నలుపుతూ తలవంచుకొని వింటున్నది.

"ఈ సంవత్సరము పరీక్షకు కూర్చునే విద్యార్థులము నలుగురమూ సామాన్యస్థితిపరులము. మావాళ్ళు భరించకలిగిన దానికంటె ఎక్కువగానే పట్నవాసములో ఉంచి మాకు కాలేజి విద్యను చెప్పిస్తున్నారు. మా మీద వాళ్ళు కొండంత ఆశ పెట్టుకొని ఉన్నారు. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు - తమ్ముళ్ల చదువులు మా భవిష్యము మీదనే ఆధారపడి ఉన్నాయి. మీతో ఇదివరలో మనవి చేసినట్టుగా మూడవ తరగతిలో ఉత్తీర్ణుల మయితే - మాకు ఉద్యోగాలు ఎవరు ఇస్తారు?"

"మీరన్న మాటా నిజమే. పెద్దవాళ్ళు ఆస్తి అంతా అమ్మి మీ విద్యకింద వ్యయపరుస్తున్న మాటా వాస్తవమే. కొండంత ఆశ పెట్టుకొనే మాటా సత్యమే. మరి - దానికి నేనేం చెయ్యను?"

"విద్యార్థుల భవిష్యత్తంతా క్లాసులోనే ఉన్నదని అధ్యాపకులకు తెలిసికూడా - ఇట్లా అన్యాయము చేస్తుంటే మేము ఎవరితో చెప్పుకోము? మీరే చెప్పండి?"

"అది సరే! నేననే మాట ఏమిటంటే ఇందులో నేను చేయకలిగిన దేమున్నదీ అని!" కనుబొమలు ముడివేసి - కాస్త గట్టిగా అన్నది విసుగుతో.

"మా భవిష్యమూ - మా కుటుంబాల అభ్యుదయమూ మా పరీక్షమీద ఆధారపడి ఉన్నాయి. మా విజయము మీ చేతిలో ఉన్నది."

చంద్రరేఖ తెల్లబోయి "అదెట్లా!" అన గలిగింది తడి ఆరిపోయిన గొంతుతో.

"మా విజ్ఞప్తిని పూర్తిగా వినండి. మేము కోరేది ఏమి టంటే......మీరు......"

"ఏమిటి?" తలపైకెత్తి ఆశ్చర్యముతో అన్నది చంద్రరేఖ.

"ఈ సహాయము మీరే చెయ్యకలుగుతారు. మీకు తప్ప మరొకరికి ఆ సామర్థ్యములేదు. సోమసుందరముగారు స్వభావ రీత్యా సజ్జనులూ - సహృదయులూను. మీరు వారి మనసును ప్రశాంత పరచగలరని మా ఉద్దేశ్యము" భీమశంకరం కను రెప్పలు ఆర్పకుండా ఆమె ముఖంమీదనే దృష్టి నిలిపి అన్నాడు.

అతడి మాటలను వినగానే ఆమె నరాలలోని రక్తము వేగముగా ప్రవహించినట్లయింది. ముఖము జేపురించి పోయింది.

"పిచ్చిమాట! వారి మనసును నేను ప్రశాంత పరచగల గటము అసంభవము. మీరు-ఈ విధంగా నాదగ్గరికి వచ్చి మాట్లా డటము నాకు నచ్చలేదు. వినేవాళ్ళు కూడా నవ్వుతారు. చాలా బాగుందిగాని...వెళ్ళండి" చంద్రరేఖ తటాలున లేచి నిలబడి "నమస్కారము" అన్నది.

కంగారుగా నలుగురు విద్యార్థులూ లేచి నిలుపబడ్డారు. మిగతా ముగ్గురూ చేతులు నలుపుకుంటూ తలలు వంచుకున్నారు.

భీమశంకరము మాత్రము "మీరట్లా అనటముభావ్యం కాదు. మా సంగతంతా అప్పటినుంచీ మీకు విపులీకరించాము. మీకూ మాకూ వయోభేదం ఎక్కువ లేనట్లు కనబడుతుంది. కాని - మమ్మల్ని తల్లిలా రక్షించవలసిన వారు మీరే!" రెండు చేతులూ జోడించి నీళ్ళు తిరిగిన కళ్ళతో ఆమె ముఖంలోకి దైన్యముతో చూశాడు.

"అబ్బా! అయితే నన్నేం చెయ్యమంటారు?" విసుగ్గా అన్నది.

"మీరు ఆ యింట్లో తిరిగి పాదం పెట్టాలి"

"అర్థం లేని మాట! నేను అక్కడికి వస్తే నాచేత మార్కులు వేయించు కోవచ్చుననా మీ ఉద్దేశ్యం!"తన మనసులో బయలుదేరిన కలవర పాటును కప్పిపుచ్చటానికి పెద్ద పెట్టున నవ్వింది.

"కాదు-కాదు! మా ఉద్దేశ్యం అది కాదండీ! ఆ యింట్లో మీరు ఉంటేనే చాలు. మీ ఉనికే అన్నిటినీ చక్కబరుస్తుందని మా నమ్మకము" అన్నాడు సవినయంగా.

"అయితే అర్ధరాత్రివేళ వచ్చి మీ అంతట మీరే మార్కులు వేసుకోరు కదా !"

"అన్యాయం! అది కాదండీ! మీరక్కడ ఉన్నారంటే మాకు క్లాసు వస్తుందని గట్టినమ్మకం ఉందండీ !"

"మీ మాటలు నా కర్థం కావటంలేదు"

"ఇందులో అర్థం కాని దేమున్నది!" అరంగటకు పైగా భీమశంకరం చంద్రరేఖతో చర్చించి "మీకు నీతులు చెప్పటానికి

గానీ-మీకు కర్తవ్యము బోధించటానికి గానీ మేమురాలేదు. కనీసము ఒకనెల రోజుల పాటు-మా పేపర్లు వారు చూడటము అయేవరకైనా మీరు మా కోరికను మన్నించాలి—" రెండు చేతులు జోడించాడు భీమశంకరము.

చంద్రరేఖ మనసు కొంచెము మెత్తబడ్డది. కాని-తన గోడు వాళ్ళతో ఎట్లా చెప్పుకుంటుంది? ఒకనెల రోజులు కాదు-ఒక్క రోజు ఉండటము కూడా యమయాతనే! పెళ్ళికి ముందు కలుస్తాయనుకున్న తమ యిద్దరి అభిప్రాయాలూ పెళ్ళి అయిన తరువాత-రెండు నెలల పాటు ఒక యింట్లో ఉన్నా కలవలేదు. అభిమానము చంపుకొని-వ్యక్తిత్వాన్ని పోగొట్టుకొని బ్రతకాలంటే విద్యావంతులకెంత కష్టము? ఈ ఆలోచనలు మనసులోకి రాగానే అప్పటికప్పుడు ఆమె కంఠధ్వని మారిపోయింది. కళ్ళల్లో నీటి చుక్కలు ముత్యాలలా మెరిసాయి.

ఆమె కలవరపాటు భీమశంకరము గ్రహించ కలిగాడు. "మీరేదో బాధపడుతున్నారు. మీ కష్టము మా కర్థమయింది. ఇరవైనాలుగు గంటలూ ఆ మనిషితో వేగటము ఎంత కష్టమో మాకూ తెలుసు. ఆ హంగామా అంతా ఇంట్లో పడేవాళ్ళు లేక పోయేసరికి అది రెట్టించిన వేగముతో విద్యార్థుల మీదికి వస్తుంది. మా కొరకు మీరీ త్యాగముచేయరూ?" అతడి గొంతు బొంగురు పోయింది. అతడిని చూస్తున్న కొద్దీ చంద్రరేఖకు మనసంతా చేత్తో కలిపినట్లయింది.

"మీరట్లా మాట్లాడితే నేనేమనగలను? నన్ను కొంచెము ఆలోచించుకో నీయండి. అది చిన్న సమస్య కాదని మీకు కూడా

తెలిసినట్లే ఉన్నది. నాకు కొంత వ్యవధి కావాలి - " ముఖము పక్కకు తిప్పుకొని కన్నీళ్లను దాచటానికి ప్రయత్నించింది.

"మాకు తృప్తికరమైన సమాధానము లభించే వరకూ మేము ఇక్కడినుంచి కదలము. అవసరమయితే నిరశన వ్రతానికి కూడా సిద్ధపడి వచ్చాము"

"అబ్బబ్బ! మీరు మరీ చిన్నపిల్లలౌలు పోతున్నారు. మంచి చెడ్డలు తెలియటం లేదు. ఈ విషయంలో మీరు విద్యార్థులని బాగా ఋజువు చేసుకున్నారు" - అన్నది గాంభీర్యముతో.

"ఆ....అదే....అదే...ఆ భావమే మా మీద ఉండాలని మేము ఇంత శ్రమ పడ్డది" భీమశంకరము ముఖము సంతోషము కొద్దీ వికసించింది. మిగతా ముగ్గురూ అతడి విజయానికి పొంగి పోయారు.

చంద్రరేఖ వాళ్ళను పంపించి లోపలికి వెళ్ళి చేతిలో ఉన్న సంచిని బల్లమీదికి విసిరివేసి - కుర్చీలో కూలబడి పోయింది.

* * * *

ఉగాది పండుగ వెళ్ళిన మరునాడు చంద్రరేఖ బండి దిగుతూ ఉండగా - వృద్ధ నౌకరు ఎదురుగా వచ్చి "ఎన్నాళ్ళకు వచ్చారు తల్లీ! ఇంక మా కష్టాలు గట్టెక్కినట్లే" సంబరము కొద్దీ బరువుగా ఉన్న సామానులు ఒక్కడే లోపలికి చేర్చాడు.

గడపలోకి రాగానే ముసలమ్మ అన్నది "అమ్మాయీ! నీరాక చూచి నేను బండెక్కుదామనుకుంటున్నాను. ఈ యింట్లో

ఒక్క క్షణమయినా ఉండలేను. నీ సంసారము నీ కొప్పగించి పోవాలని ఇంత కాలమూ ఓపిక పట్టాననుకో"...అంటూ కళ్ళు ఒత్తుకున్నది.

చంద్రరేఖ పెదవులను పళ్లతో కొరుకుతూ లోపలికి వెళ్ళింది. ఎవరికీ కనబడకుండా వంటయింట్లో ఒక పక్కగా పీట మీద కూర్చున్నది.

పదిగంటలవేళ సోమసుందరము విడిగా ఉన్న భోజనాల గదిలో వచ్చి కూర్చున్నాడు. వడ్డించిన పదార్థాలన్నీ వాసన చూసి పక్కకు నెట్టటము మొదలు పెట్టాడు.

"పెరుగు తీసుకురా !" అంటూ ఉన్నట్టుండి ఒక పెద్దకేక పెట్టాడు.

"కూర బాగుంది నాయనా! పులుసు నీకిష్టమని చేశాను"... ముసలమ్మ ఎదురుగా నిలబడ్డది నేతి గిన్నె చేతబట్టుకుని.

"పెరుగు...పెరుగు...వినబడుతున్నదా?" కొండ కేకలు పెట్టాడు. వంటయింట్లో ఒక మూలకు ఒదిగి కూర్చున్న చంద్ర రేఖ గజగజ వణకి పోయింది.

అతడిని మేడమీదికి పోనిచ్చి "చూశావా అమ్మాయీ! చస్తున్నాననుకో. ఆ నౌకరయినా సుఖపడుతున్నాడనుకున్నావా? చేసిన పని మెచ్చడు. తనకేం కావాలో చెప్పడు. ప్రతిదానికీ చంపు తున్నాడనుకో. పసిగుడ్డును పెంచాను కనుక — మమకారము వీడలేకపోతున్నాను. ఒక్కొక్క రోజు కళ్లకు నీళ్లు వస్తున్నా

యనుకో" - ముసలమ్మ మాట పూర్తిచేయక ముందే పైనుంచి పెద్ద చప్పుడు వినబడ్డది. చంద్రరేఖ అదిరిపోయింది, ఆమె కాళ్ళూ చేతులూ వణకిపోయాయి.

సోమసుందరము ఇంటినుంచి వెళ్ళిపోయిన తరువాత చంద్రరేఖ మేడమీదికి వెళ్ళి చూసింది. పుస్తకాల షెల్ఫు కాస్తా బోర్లాపడి ఉన్నది. బల్లమీది అద్దము ముక్కలైపోయింది. బట్టలన్నీ నేలమీద కుప్పలు కుప్పలుగా గదినిండా పడి ఉన్నాయి. చంద్రరేఖ ప్రతిమలా ఆ గదిలో మధ్యగా నిలబడిపోయింది పావుగంట సేపు.

ఎంతో సౌమ్యుడనిపించుకున్న సోమసుందరము కొద్ది రోజులలోనే చక్కెర పూతలో ఉన్న క్వైనా మాత్రగా మారి పోయాడు. మిలమిల మెరసిపోతే కాంచనమని భ్రమించింది. తనకు లభించిన లోహము ఇంతకూ బంగారమా ఇత్తడా ? లేక ఈ మార్పు తాత్కాలికమా ? ఆమె మనసు ఆలోచనలతో పరిభ్రమించి పోయింది.

చంద్రరేఖ సోమసుందరముకంటికి కనబడకుండా వంట యింట్లోచేరి తనకు చేతనైనవీ - సామాన్యముగా అందరూ తినేవీ నాలుగైదు రకాల వంటకాలను చేస్తూఉండేది. అతడికి అవసరమనుకున్నవీ - నచ్చుతాయనుకున్నవీ ఆ యింట్లో రెండు మూడు స్థలాలలో చంద్రరేఖ పెట్టించింది.

అలవాటు చొప్పున సోమసుందము కేకలు పెట్టుతూ ఎదు రుగా ఉన్న వస్తువులను అందుకుంటూ ఉండేవాడు. నౌకరు కంటికి కనబడగానే "ఛీ ఛీ! ఇదిగాదు. ఇంకోటి తీసుకురా" అని

చిందులూ గంతులూ వేశాడు. కాని ఆ యిల్లంతా ఒక్క కట్టడి మీద నడిచిపోతున్నది. అతడెంత అరచినా ఎవరూ సమాధాన మివ్వరు. గట్టిగా రెట్టిస్తే తలవంచుకోవటం తప్ప ఎదురు జవాబు రాదు.

పదిరోజు లయేసరికి వడ్డించిన పదార్థాలలో కొన్నిటిని క్రమముగా సోమసుందరము రుచిచూస్తూ వచ్చాడు. కొన్నాళ్లకు కేకలు కాస్త మందగించాయి.

ఒక రోజు అకస్మాత్తుగా ఆరవేసిన చీరె ఒకటి అతడి కంట బడ్డది. అతడా ప్రాంతాలకు వస్తాడని ఇంట్లో ఎవరూ ఊహించలేదు. ఆ చీరె చూడగానే అతడికేదో గుర్తుకు వచ్చింది. మనసులో చిటపట రేగింది.

"ఎవరి దా చీరె అమ్మమ్మా" గర్జించాడు. ముసలమ్మ కంపించిపోయింది.

"అభిమానము వంటపుట్టాలిగాని కొంటే వస్తుందా? మళ్ళీ ఈ గడప ఎట్లా తొక్కింది?"

వంటయింట్లో నిలబడి కిటికీగుండా చెట్ల మీదికి దృష్టిని పోనిచ్చి ఆలోచిస్తున్నది చంద్రరేఖ. సోమసుందరము మాట్లాడిన ప్రతిమాటా ఆమె హృదయంలోనుంచి దూసుకుని పోయింది. ఆపదను కోరి తెచ్చుకున్నానని చింతించింది. రోషమూ అభి మానమూ పైకి ఉబికి ముఖము కందిపోయింది. తటాలున ఒక నిశ్చయానికి వచ్చి, గిరుక్కున తిరిగి, గడప వరకూ అడుగులు వేసింది. అంతలో ఆమె కళ్లముందర విద్యార్థుల దీనవదనాలు

బొమ్మకట్టినట్లయింది. వెనుకకు అడుగువేసి గోడకు అంటుకు పోయింది.

"తిరుగు బండి ఎక్కమని చెప్పు" నేల మీద చెప్పులు చప్పుడు చేస్తూ - తలుపులు రెండు చేతులతో తోసుకుంటూ వెళ్లి పోయాడు.

చంద్రరేఖ కుమిలి కుమిలి కన్నీరు కార్చింది. ఆమె కక్కడ రోజుకొక పిడుగుపాటుగా ఉన్నది. బలవంతంగా రోజులను నెట్టుకు వస్తున్నది.

* * * *

అది వసంతఋతువు. ప్రకృతి తన దేహాన్ని రమణీయంగా అలంకరించుకొని నవ్యవసంతుడికి హృదయపూర్వకమయిన స్వాగతమిస్తున్నది.

ముఖముమీద చెమటలు తుడుచుకుంటూ - చికాకుతో చిందులు తొక్కుతూ మధ్యాహ్నము ఒంటి గంటకు సోమ సుందరము ఇంటికి వచ్చాడు. హాలు దాటి లోపలికి వెళ్లగానే అతడికి మంచినీళ్ల కూజా - దాని పక్క గ్లాసూ కనబడ్డాయి. విసురుగా వెళ్ళి కూజా వంచుకొని రెండు గ్లాసుల నీళ్ళు తాగాడు. అక్కడినుంచి తిన్నగా తన గదికి వెళ్లి దుస్తులు మార్చుకొని బయటికి వస్తుండగా ఒక బల్లమీద ఐస్క్రీమ్ ప్లేటొకటి కనబడ్డది. గాజు కూజాలో ఉన్న షర్బతు చూడ గానే అడుగులు నిలిచాయి. ఆ బల్ల దగ్గర నాలుగు నిమిషాల పాటు నిలబడి - వాటిని సేవించి పడకగదిలోనికి వెళ్ళి విశ్రి

మించాడు. ఆ గది శీతలమయమై - ఒక ప్రక్కనుంచి విసురుగా గాలికొడుతూ ఉండటమువల్ల అతడు తనకు తెలియకుండానే నిద్రకు వశుడై పోయాడు.

రాత్రి ఎనిమిది గంటలవేళ - సోమసుందరం భోజనానికి కూర్చున్నాడు. రెండు మూడు పర్యాయములు ముసలమ్మను పిలిచి "ఈ కూర ఇట్లా ఉన్నదేమిటి?" అని అరిచి కేకలు వెయ్యటానికి ప్రయత్నించాడు. కాని పాకరుచులు అతడిని మాట్లాడనివ్వలేదు. పనివేళ - నౌకరును పిలిచి రెండు నిమిషాల తరువాత కారణమేమీ దొరకక "నీపని చూసుకో పో" అన్నాడు.

ఇలాగ వారము రోజులయ్యే సరికి అతడి గదిలోనుంచి సన్నటి కూనిరాగాలు మేడకింద ఉన్న ముసలమ్మకు వినబడటము మొదలయింది.

ఒకనాడు డాబామీద పడకకుర్చీలో పడుకుని అతడు మధురకంఠముతో ఎంకిపాటలు పాడుతుండగా పున్నమిచంద్రుడు కలకలనవ్వాడు.

* * * *

సోమసుందరము అప్పుడే దుస్తులు మార్చుకొని గదిదాటి వస్తుండగా "అయ్యగారు వస్తున్నారు. తొందరగా ఈ పళ్ళెము బల్లమీద పెట్టిరా" అని ముసలమ్మ అంటున్నది.

ఆ మధురపదార్థాలను సేవించుతూ ఉండగా నౌకరు ఐస్క్రీము తెచ్చి బల్లమీద పెట్టాడు. సోమసుందరానికి ఈమధ్య అది ఉంటే సరి - ఇక భోజన మక్కర లేదనిపిస్తున్నది.

ఐస్క్రీము తన కంత ప్రీతికరమయిన పదార్థమని అదివరలో అతడికి తెలియనైనా తెలియదు. తెలియక పోవటమేమిటని అతడికే ఆశ్చర్యంగా ఉన్నది.

ఆ సాయంత్రం మాతడు /మామూలువేళకంటె గంట ముందుగా ఇంటికి వచ్చాడు. అతడు బట్టలు మార్చుకొని లోపటినుంచి వస్తూఉండగా వంటయింటి ముందర పత్రిక చదువుతున్న చంద్రరేఖ కనబడ్డది. వెనుకనుంచి వచ్చి ఆమె చేతిలో ఉన్న పత్రిక లాగేసి ముందుకు వచ్చి నిలబడ్డాడు.

విస్మయము ఒకపక్క - భయమొక పక్క - ఆమెను కంగారు పెట్టాయి. ఏదో అఘాయిత్యం జరుగుతుంది కాబోలని వణుకుతూ నిలబడి పోయింది.

"నీవు వెళ్లలేదూ? ఉండే దాగుడు మూతలాడుతున్నావా?" అని నవ్వాడు.

సంభ్రమములో ఆమె తబ్బిబ్బయి పోయింది. అతడి నవ్వులో ఆమెకెన్నో అర్థాలు - ఎన్నో స్వాగతాలు - ఎన్నో ఆహ్వానాలు గోచరించాయి.

ఆమె మనోవీధిలో ఆ నలుగురు విద్యార్థుల దీనవదనాలు ప్రఫుల్లములయినట్లు కనబడ్డాయి.

*   *   *   *

మధ్య మధ్య ఐస్క్రీము ఆరగిస్తూ సోమసుందరము బల్ల ముందర కూర్చున్నాడు. వర్జీనియా చుట్టపొగల మేఘాలు వలయా

కారముగా ఆ గది నావరించుకున్నాయి. ఒక మూలనుంచి ఎలక్ట్రిక్కుఫాను విసురుతున్నది. విశ్రాంతిగా - ప్రశాంతముగా సోమసుందరము పరీక్షాపత్రాలను తిప్పుతున్నాడు. అతడి చేతిలో ఉన్న ఎర్రటి పెన్సిలు విజయ సూచకమైన రేఖలను పత్రాలమీద రచిస్తున్నది.

* * * * * *

పరీక్షలో కృతకృత్యులయిన ఆ నలుగురు విద్యార్థులూ తమ పేర్లను అడుగున చెక్కించి ఒక ఫొటో ఫ్రేమును సోమ సుందరము దంపతులకు పంపారు.

"ఇది ఎక్కడిది?" అన్నాడు సోమసుందరము. "ఇదా? ఇది సైకాలజీని అర్థము చేసుకొన్న చిహ్నం" అంటూ చంద్ర రేఖ మందహాసము చేసింది.

ఆ మందహాసమొక విరజాజి మాలికై అతడి గళసీమ నలంకరించింది.